రైతు సంక్షేమానికి సీఎం కృషి



పులిదిండిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: రైతుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పులిదిండి, వెలిచేరు తదితర గ్రామాల్లో పర్యటించారు. పులిదిండి గ్రామంలో రూ.9 లక్షలతో సొసైటీ భవనం మరామతులు పూర్తి చేసి ప్రారంభించారు. రూ.5 లక్షలతో నిర్మించిన కల్వర్టును ప్రారంభించారు. వెలిచేరు హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. పులిదిండిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరలా గెలిపించుకోవాలని, అప్పుడే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. దేవాలయాల కోసం సుమారు రూ.5 కోట్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, గోపాలపురం వంటి దేవస్థానాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, మండల వైస్ ఎంపీపీ పెన్మెత్స బంగార్రాజు, సీనియర్ పార్టీ నాయకులు కునాథరాజు రంగరాజు, కొరుప్రోలు వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యాంసన్, సర్పంచ్‌లు గాదిరాజు రామకృష్ణంరాజు, పాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పతకాలు చూపుతున్న క్రీడాకారులు

అంబాజీపేట: జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు అంబాజీపేట క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక క్రీడాప్రాంగణంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆదివారం పలువురు అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడ ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో జూనియర్ బాలుర విభాగంలో విజయ రాఘవేంద్ర (బ్రాంజ్ మెడల్), సీనియర్ బాలికల విభాగంలో కొరిగి నందు కె.వైష్ణవి, బీహెచ్ఎల్ సౌమ్యలు గోల్డ్ మెడల్స్‌ను, పూమ్‌సే విభాగంలో పి.భార్గవి శ్రీకళ, కె.వైష్ణవిలు గోల్డ్ మెడల్స్ పొందారన్నారు. ఈ నలుగురు క్రీడాకారులు జనవరిలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనున్నారన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



మామిడికుదురులో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

మామిడికుదురు: యూటీఎఫ్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓలు ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు ఆదివారం ఆవిష్కరించారు. మామిడికుదురు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద డైరీతో పాటు క్యాలెండర్, ఫోన్‌బుక్, స్టికర్లు ఆవిష్కరించారు. ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు జీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాయుడు నాగేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, టీఆర్‌కే గణపతిరావు, జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

'కంభంపాటి'కి ఘన సన్మానం



అవిడిలో ఉత్తమ ఉపాధ్యాయుడు కంభంపాటిని సత్కరిస్తున్న సర్పంచ్ రెడ్డి చంటి తదితరులు

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామానికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కంభంపాటి సూర్యనారాయణను అవిడి గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం పి.గన్నవరం మండలం నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ విద్యార్థులకు విద్యాబోధనలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా పాఠశాలల్లో విద్యార్థుల పేరెంట్స్ నుంచి అభినందనలు అందుకున్నారు. అలా 2005 నుంచి డివిజన్ 9 సార్లు, జిల్లా స్థాయిలో 5 సార్లు ప్రభుత్వం నుంచి, వివిధ సంస్థల నుంచి తాజాగా ఈ ఏడాదీ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆయన విద్యాసేవలను గుర్తించిన అవిడి గ్రామస్తులు సర్పంచ్ రెడ్డి చంటి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ నామాడి రాజారత్నం, పర్సన్ పడమట సూర్యప్రకాశరావు, పార్టీ నాయకులు కొండేటి శ్రీనివాస్, కుంచే వెంకట్రావు, చప్పిడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

అంబాజీపేట: ఇటీవల చిరతపూడికి చెందిన పువ్వాడ శ్రీను గుండెపోటుతో శనివారం మృతి చెందడంలో వైఎస్సార్ బీమాను పంపిణీ చేశారు. ప్రభుత్వం తక్షణ సాయం కింద మృతుడి తల్లి పద్మావతికి రూ.10 వేల నగదును సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్ శిరీష, పచ్చిపాల శ్రీను, పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయాలే..



అంబాజీపేటలో ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రమాదేవి

అంబాజీపేట: పట్టుదల, క్రమశిక్షణతో పాటు ఇష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివితే విజయాలు తమ వెంటే ఉంటాయని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోకా రమాదేవి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ అధ్యక్షుడు నందిక వెంకటేశ్వరరావు అధ్యక్షతన గ్రూప్–1, 2ల విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాంకేతిక నైపుణ్యంతో చదవడం వల్ల ఫలితాలు పొందవచ్చన్నారు. ఏదైనా కష్టపడి ఇష్టంగా చదివితే భవిష్యత్ బంగారు బాట అవుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 400 మంది విద్యార్థులు గ్రూప్–1, 2 నమూనా పరీక్షకు హాజరయ్యారన్నారు. వీరిలో అత్యధిక మార్కులు వచ్చిన 100 మందికి ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మరో 100 మందికి ఉచిత కోచింగ్ కూపన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, జిల్లా సంక్షేమ కార్యదర్శి గోసంగి బంగార్రాజు, గెడ్డం ప్రదీప్, గూటం సాయి, పరమట నాని, వెన్నపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రామయ్య అక్షింతలు

కపిలేశ్వరపురం (మండపేట): లోక కల్యాణం కోసం ప్రతి ఇంటికీ అయోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరాముని అక్షింతలు భక్తులకు సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్టు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఆలయ ప్రారంభం నేపథ్యంలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ తదితర ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో అక్షింతలు పంపిణీ జరుగుతోందన్నారు.

మోదీ హయాంలోనే దేశాభివృద్ధి



పల్లిపాలెం సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమా

మలికిపురం: ప్రధాని మోదీ హయాంలోనే దేశం అభివృద్ధి పథంలో సాగుతుందని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా అన్నారు. ఆదివారం మండలంలోని గూడపల్లి పల్లిపాలెం, పడమటి పాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో జరిగిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలను అందిస్తుందని ఆయన అన్నారు. గత పాలనలో చేయని అభివృద్ధిని ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్నారని ఆయన అన్నారు. గ్రామ సర్పంచ్‌లు పెచ్చెట్టి నరసింహస్వామి, ఆకుల చినవెంకన్న నాయుడు, అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలు జరిగాయి. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అడబాల రాంబాబు, మలికిపురం మండల పార్టీ అధ్యక్షులు కాపిశెట్టి కనకేశ్వరరావు, నాయకులు అడపా సత్తిబాబు, మేడిచర్ల చాణక్య, అడబాల నరసింహారావు, ముత్యాల తాతంబాబు, కోలా పల్లపురాజు, ముత్యాల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



కొమరాడలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: అయోధ్య శ్రీరాముని అక్షతలను ఊరేగిస్తూ ఆదివారం మండలంలోని రెండు గ్రామాల్లో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. కొమరాడ, అప్పనపల్లి గ్రామాల్లో అక్షతలను శిరస్సుపై పెట్టుకుని శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ నినాదాలతో భక్తులు సందడి చేశారు. కడలి ప్రసాద్, వలవల పెదబాబు, చెల్లింగి ఏసుబాబు, బైరిశెట్టి కోటేశ్వరరావు, కడలి శ్రీనివాస్, కాపవరపు గోపాలకృష్ణ తదితరులు శోభాయాత్రలో పాల్గొన్నారు.









జాప్యమేల..!

- నత్తనడకన వరి నాట్లు
- ఆలస్యమవుతున్న రబీ
- చివరిలో చిక్కులు తప్పవంటున్న అధికారులు



గొల్లపాలెంలోని ఓ పొలంలో ట్రాక్టర్‌తో దమ్ములు చేస్తున్న రైతు

కాజులూరు: జనవరి నెల ప్రారంభమవుతున్నా అనేక గ్రామాల్లో ఇప్పటికీ వరి నాట్లు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో రైతులు పంటదమ్ములు చేస్తూ వెద చల్లికలు నిర్వహిస్తున్నారు. కాజులూరు మండల గ్రామాల్లో వరి పొలాలు తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్నాయి. దీంతో సాధారణంగానే డెల్టా ఎగువ ప్రాంతంలోని కడియం, మండపేట తదితర ప్రాంతాలకంటే, ఇక్కడి గ్రామాల్లో ఒకటి, రెండు వారాలు ఆలస్యంగా వరిసాగు ప్రక్రియ కొనసాగుతుంది. ఈ లెక్కన చూసినా నవంబరు నెలాఖరు నాటికి రైతులు తొలకరి మాసూళ్లు ముగించి, డిసెంబర్ రెండో వారం నాటికి దాళ్వా వరి నాట్లు పూర్తి చేయాల్సి ఉంది.

తుపాను ప్రభావం కారణమే..

ఈ ఏడాది తొలకరి చివరి దశలో వచ్చిన మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు అనేక గ్రామాల్లో వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో తొలకరి మాసూళ్లల్లో తీవ్ర జాప్యం జరిగి, దాని ప్రభావం దాళ్వా సాగుపై పడింది. ప్రస్తుతం దాళ్వా వరినాట్లు, వెద చల్లికలు ఆలస్యమైతే, పంట చివరి దశలో సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు గురి కావాల్సి వస్తోందని వ్యవసాయ రంగ నిపుణులు చెబుతున్నారు.

ముమ్ముందు సమస్యలే..!

గతంలో మాదిరిగా మార్చి, ఏప్రిల్ నాటికి గోదావరి నదిలో నీటి నిల్వలు తగ్గి, కాలువలకు నీటి ఎద్దడి ఏర్పడితే శివారు భూములకు నీటి సరఫరా తగ్గిపోతుందని పలువురు చెబుతున్నారు. మరోవైపు ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి కాలువ నీరు నిలుపుదల చేస్తామని నీటి పారుదల శాఖ అధికారులు ముందుగానే హెచ్చరించారు. ఫలితంగా రైతులు సాగు ప్రారంభించేందుకు కాలయాపన చేస్తుంటే, చివరిలో నీరులేక పంట ఎండిపాయే పరిస్థితి ఏర్పడుతుందని వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సభలు, సమావేశాలు పెట్టి మరీ హెచ్చరిస్తున్నారు. రైతులు చొరవ చూపి, త్వరితగతిన సాగుకు ఉపక్రమించాలని, ఇప్పటికే కాలాతీతమైనందున తక్కువ కాల పరిమితికి దిగుబడి ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



కాజులూరులో వరినాట్లు వేస్తున్న మహిళలు

సాగు గణాంకాలిలా..

రామచంద్రపురం నియోజకవర్గంలో 63 వేల ఎకరాలు సాగుభూమి ఉండగా, ఈ ఏడాది దాళ్వాలో 52 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. ఇందులో రామచంద్రపురం మండలంలో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా, 50 శాతం పొలాల్లోనూ, కాజులూరు మండలంలో 19 వేల ఎకరాల్లో సాగు చేపట్టగా, 40 శాతం పొలాల్లో రైతులు వరినాట్లు, వెద చల్లిక పనులు పూర్తి చేశారు. ఇక కె.గంగవరం మండలంలో 18 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టగా, ఇప్పటివరకూ కేవలం 20 శాతం మాత్రమే వరినాట్లు, వెద చల్లిక పనులు పూర్తయ్యాయి.

తుపాను వల్లనే..



ఈ ఏడాది తొలకరి చివరి దశలో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసి, మాసూళ్లు ఆలస్యమయ్యాయి. ఏదోలా చొరవ చేసి దాళ్వా నారుమడులు చల్లుకున్నాం. గింజ మొలకెత్తే సమయంలో పూడుకుపోయిన డ్రెయిన్ల కారణంగా పొలాల్లో నీరు దిగక మొక్క కుళ్లిపోయింది. రెండోసారి నారుమడులు చల్లుకోవటంతో ఆలస్యమైంది.

– నరాల నాగేశ్వరరావు, రైతు, దుగ్గుదూరు

ఇబ్బందులు తప్పవు



వరిపంట గింజ గట్టిపడి, పక్వానికి వచ్చే వరకూ సాగునీరు అవసరం. చివరి దశలోనూ సాగు నీరందకుంటే దిగుబడి కోల్పోయే అవకాశం ఉంది. ఇప్పటికీ నాట్లు వెయ్యని రైతులు వెద చల్లిక విధానాన్ని అవలంబించాలి. తక్కువ రోజుల్లో పక్వానికి వచ్చే వంగడాలను ఎంచుకోవాలి.

– వి.అశోక్, ఎంఏఓ, కాజులూరు

సబ్ డివిజన్‌లో సెక్షన్ 30 అమలు



టీఎస్ఆర్‌కే ప్రసాద్, డీఎస్పీ, రామచంద్రపురం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, రాయవరం, అంగర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 1 నుంచి 31 వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుందని రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు జరపడానికి వీల్లేదన్నారు. అటువంటివి జరపాలనుకుంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





కొనసాగుతున్న కార్మికుల సమ్మె

రామచంద్రపురం: పట్టణంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఐదో రోజు ఆదివారం కొనసాగింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, గోరిపర్తి నాగభూషణం, యూటీఎఫ్ నాయకుడు గోవిందరావు తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పిల్లి వెంకటరావు, గుత్తుల తాతారావు, మేడిశెట్టి నాగబాబు, గోరపర్తి భీమశంకర్, ముత్యాల నాగరాజు, గూడుపు చిన్న అప్పారావు, మందపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శక్తి రూపం



రాయవరంలో శక్తి రూపాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు


రాయవరం: సంక్రాంతి నెల ప్రారంభం కాగానే పలువురు కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శిస్తుంటారు. అందులో భాగంగానే పగటి వేషధారులు కూడా రోజుకో రూపంతో గ్రామాల్లో తిరుగుతూ ఉంటారు. అదే కోవలో అనపర్తికి చెందిన పగటి వేషధారుల కుటుంబానికి చెందిన విప్పా కృపావరం శక్తి వేషధారణతో ప్రజలను ఆకట్టుకున్నాడు. కృపావరం చిన్న కుమారుడు శక్తిరూపం ధరించగా, పెద్ద కుమారుడు రమేష్ డప్పు కొడుతూ గ్రామంలో హల్‌చల్ చేశారు. శక్తి రూపాన్ని చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆసక్తిగా తిలకించారు.

రబీలో వెదజల్లుకే అధిక ప్రాధాన్యం



వెదజల్లు విధానంలో సాగు చేసిన వరి చేను

రాయవరం: మండలంలో జోరుగా రబీ వరినాట్లు సాగుతున్నాయి. మండలంలో 14,641 ఎకరాల్లో రబీ వరి సాగును రైతులు చేపడుతున్నారు. ఇప్పటికే 65 శాతం మేర రైతులు వరి నాట్లు పూర్తి చేశారు. మొత్తం 8,450 ఎకరాల్లో వరి నాట్లు వేయగా, 95 శాతం మేర రైతులు వెదజల్లు విధానంలో సాగు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో రబీ వరి నాట్లు మండలంలో పూర్తి కావచ్చని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు.











వ్యవసాయానికి ప్రాధాన్యం

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో వ్యవసాయానికి తగిన ప్రాధాన్యం లభిస్తోందని మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. ఆదివారం తణుకువాడ రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ ఆదునిక పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనంతగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతాంగానికి భరోసా కల్పించిందన్నారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌లు దెయ్యాల వెంకటరమణ, వాసంశెట్టి శ్రీనివాస్, పితాని ఆదినారాయణ, మాజీ ఉప సర్పంచ్ పితాని సత్యనారాయణ, పితాని సత్తిబాబు పాల్గొన్నారు.


రాయవరంలో బొకేలను కొనుగోలు చేస్తున్న ప్రజలు


రాయవరంలో నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమైన కేకులు

నయా జోష్

- నూతన సంవత్సరానికి ఘన స్వాగతం
- కళకళలాడిన బేకరీలు, హోటళ్లు
- సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు
- రంగవల్లులతో నిండిన వీధులు


గొల్లపాలెంలో అలయన్స్ క్లబ్ కార్యాలయం వద్ద ముగ్గులు పెడుతున్న మహిళలు

రాయవరం: కాలచక్రం గిర్రున తిరిగింది. చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది. కొన్ని చేదుజ్ఞాపకాలు మిగిల్చి.. కొన్ని తీపి అనుభూతులను పంచి.. మరెన్నో లక్ష్యాలను సాధించిపెట్టి 2023 చల్లగా జారుకుంది. ఇంకెన్నో ఆశయాలను ముందుంచుతూ కొత్త సంవత్సరం (2024) కోటి ఆశలతో స్వాగతం పలికింది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటి 2024లోకి ప్రవేశించిన క్షణాల్లోనే ప్రజలు కేరింతలు కొడుతూ నూతన సంవత్సరాన్ని స్వాగతించారు. పలువురు కేకులు కట్ చేసి, యువత కేరింతలు కొడుతూ నూతన సంవత్సర వేడుకలు చేసుకున్నారు. స్నేహితులు, బంధువులు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు విరివిగా వినియోగించే గ్రీటింగ్ కార్డులు మార్కెట్లో అంతగా కానరాలేదు. నాయకులు, ప్రజాప్రతినిధులకు గ్రీటింగ్స్ చెప్పేందుకు పూలదండలు, బొకేల దుకాణాలు మాత్రం రద్దీగా కన్పించాయి.

వాకిళ్ల ముంగిట రంగవల్లులు

ప్రజలు 2023కు వీడ్కోలు చెబుతూ, 2024కి ఘనస్వాగతం పలికారు. యువత నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ హడావిడి చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి ఇళ్లు, వ్యాపార సంస్థల ముంగిట సోమవారంతో ప్రారంభమయ్యే నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులతో వాకిళ్లు అలంకరించారు. పలువురు తమ గృహాలు, వ్యాపార సంస్థలకు విద్యుద్దీపాలంకరణ చేశారు. రాత్రి నుంచే చాలా మంది పూలబొకేలను కొనుగోలు చేశారు. అందరికీ మంచి జరగాలంటూ పలుచోట్ల క్రైస్తవారాధకులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాయవరంలోని అపోస్తలిక్ ప్రేయర్ హౌస్ పాస్టర్ గొడుగు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు గీతాలను ఆలపిస్తూ, కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు.

బిర్యానీ పాయింట్లు కిటకిట

గ్రామ గ్రామాన ఎక్కడికక్కడ బిర్యానీ పాయింట్లు మాంసాహార ప్రియులతో కిటకిటలాడాయి. ఫ్యామిలీ ప్యాక్‌లు ప్యాకేజీ ధరల్లో అందించారు. ఇయర్ ఎండింగ్ ఆదివారం కావడంతో మాంసాహార ప్రియులు బిర్యానీ కొనుగోళ్లకు అధిక ప్రాధాన్యమిచ్చారు. హోటళ్లలో రకరకాల నాన్‌వెజ్ వంటకాలు సిద్ధం చేశారు. సాయంత్రం నుంచే బైక్‌లపై యువత హల్‌చల్ కనిపించింది. గతంలో కీలక పాత్ర పోషించిన గ్రీటింగ్ కార్డులు దాదాపు కనుమరుగు కావడంతో ఇప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలు గ్రీటింగ్స్ చెప్పుకొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాయవరం ఎస్సై జి.నరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది రాత్రంతా బందోబస్తు నిర్వహించారు.

విందులు, వినోదాల్లో యువత

కాజులూరు: మండలంలోని అనేక గ్రామాల్లో ఆదివారం నూతన సంవత్సర స్వాగత వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. 2024కు స్వాగతం చెబుతూ 2023కు వీడ్కోలు పలుకుతూ, మహిళలు తమ ఇళ్ల ముందు రంగవల్లులు వేశారు. యువకులు విందులు, వినోదాలు ఏర్పాటు చేసుకుని, పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. రాత్రి 12 కాగానే యువకులు, విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. పలువురు కేక్ కట్ చేసి, స్థానికులకు పంచిపెట్టారు. గొల్లపాలెంలో అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సభ్యులు నూతన సంవత్సర వేడుకలకు ఆటల, రంగవల్లుల పోటీలు నిర్వహించారు.విజేతలకు క్లబ్ అధ్యక్షురాలు, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి బహుమతులు అందజేశారు.

నేడు అందుబాటులో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో మండపేట పట్టణం ఆర్టీసీ బస్టాండ్ వద్దఉన్న సూర్య ఫంక్షన్ హాల్‌లో అందుబాటులో ఉంటారు. ఉదయం 9.30 నుంచి ఆయనను కలవవచ్చని ఆయన కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

నల్లూరులో ఎమ్మెల్యే పర్యటన

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పర్యటించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి లీలాకృష్ణతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంకీర్ణ కూటమిని ఆదరించాలని కోరారు.

కోటి ఆశలతో స్వాగతం


పట్టణంలో దుకాణాల వద్ద అమ్మకానికి ఉంచిన బొకేలు, పూలదండలు


రంగులను కొంటున్న చిన్నారులు

కె.గంగవరం: రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ప్రజలు కోటి ఆశలతో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాల వద్ద భారీ టెంట్లతో ఏర్పాట్లు చురుగ్గా సాగాయి. ప్రతి గ్రామంలో ఏ సెంటర్ చూసినా తమ స్తోమతను బట్టి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పార్టీ శ్రేణులు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసే కటౌట్లను నెలకొల్పారు. పట్టణాలతో పాటు గ్రామాల్లోని వివిధ ప్రధాన సెంటర్లలో వివిధ సామాజిక యువజన సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం, ద్రాక్షరామతో పాటు పలు గ్రామాల్లో బిర్యానీ సెంటర్లు వెలిశాయి. యువత బిర్యాని కొనుగోలుకు పోటీ పడ్డారు. పలు హోటళ్లు ప్రత్యేక వంటకాలతో వినియోగదారులను ఆకర్షించేలా ఆఫర్లు ప్రకటించారు. కొత్త సంవత్సర కేక్‌ల ఆర్డర్లు భారీఎత్తున సాగాయి. నూతన సంవత్సర వేళ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేడు అందుబాటులో మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 11 గంటల నుంచి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తన క్యాంపు కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు ఆయనను కలుసుకోవచ్చని మంత్రి అడిషనల్ పీఎస్ పి.తేజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రియేటివ్ ఆర్ట్‌తో న్యూ ఇయర్ శుభాకాంక్షలు


రామవరపు గోపాలకృష్ణయ్య


క్రియేటివ్ ఆర్ట్‌తో రూపొందించిన 2024 గ్రీటింగ్ కార్డు

రాయవరం : నూతన సంవత్సరాన్ని పలువురు పలు విధాలుగా స్వాగతిస్తుంటారు. రాయవరం గ్రామానికి చెందిన రామవరపు గోపాలకృష్ణయ్య తన క్రియేటివ్ ఆర్ట్ ద్వారా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ గ్రీటింగ్ కార్డును రూపొందించారు. హ్యాపీ న్యూ ఇయర్ 2024 అంటూ 2023 నుంచి 2024లోకి అడుగిడుతున్నట్టుగా రూపొందించిన గ్రీటింగ్ కార్డు పలువురిని ఆకట్టుకుంది. చిన్న ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న గోపాలకృష్ణయ్య క్రియేటివ్ ఆర్ట్‌ను పలువురు అభినందించారు.